క్లుప్తంగా

నిబంధనల ఉల్లంఘనపై కన్నెర్ర

- 41 ద్విచక్రవాహనాల స్వాధీనం
- తల్లిదండ్రుల సమక్షంలో వాహనచోదకులకు కౌన్సెలింగ్

నెల్లూరు(క్రైమ్): ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి 41 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనచోదకులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్‌ను శనివారం జరిపారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలకు గల కారణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడారు. మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని.. నిబంధనలను అతిక్రమించి వారు పట్టుబడితే తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ, ఎస్సై శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో శస్త్రచికిత్స విజయవంతం



నెల్లూరు(బారకాసు): ఇద్దరు రోగుల వెన్నుపూసకు సంబంధించిన క్లిష్టమైన సమస్యకు నారాయణ హాస్పిటల్ వైద్యులు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. చింతారెడ్డిపాళెంలోని హాస్పిటల్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను న్యూరోసర్జన్ సాయికిరణ్ వెల్లడించారు. ముత్తుకూరు మండలం గోవిందరెడ్డిపాళేనికి చెందిన 23 ఏళ్ల సుప్రియ, అన్నమయ్య జిల్లాకు చెందిన 77 ఏళ్ల ఉమాదేవి కొన్ని నెలలుగా మెడనొప్పి, చేతులు, కాళ్ల తిమ్మిర్లతో బాధపడుతూ తమ ఆస్పత్రిని సంప్రదించారని చెప్పారు. వీరికి అవసరమైన వైద్య పరీక్షలను నిర్వహించి, వెన్నుపూసకు సంబంధించిన సమస్య వచ్చిందనే అంశాన్ని నిర్ధారించామని తెలిపారు. నరంపై ఒత్తిడికి కారణమైన వెన్నుపూసకు సంబంధించిన ఎముకను తొలగించే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని వివరించారు. న్యూరో అనస్థీషియా వైద్యులు అనిల్‌కుమార్, కృష్ణచైతన్య, పృథి, బృంద, తదితరులు సహకారం అందించారని చెప్పారు. అనంతరం హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్ మాట్లాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సను ఉచితంగా నిర్వహించామని పేర్కొన్నారు. హాస్పిటల్ ఏఎమ్మెస్ డాక్టర్ సుప్రజ, ఏజీఎం శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్ వాసి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు గానీ ఓ వ్యక్తి తన గదిలోనే మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్ (32) కాకర్లవారివీధిలో ఉంటూ రాళ్ల వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు వివాహమై భార్య దూరంగా ఉంటున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ఎక్కడికీ వెళ్లకుండా ఇంటికే పరిమితమయ్యారు. తన ఇంటి సమీపంలోనే ఉంటున్న అక్క అతని బాగోగులను చూస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన ఇంట్లోనే శనివారం మృతి చెందారు. గమనించిన మృతుడి మేనల్లుడు ఆనంద్ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. వీఎమ్మార్‌నగర్‌లో కామాక్షి తన తల్లి వెంకటసుబ్బమ్మ(63)తో కలిసి నివాసం ఉంటోంది. కామాక్షి ఆటోనగర్‌లోని ఓ బిస్కెట్ ఫ్యాక్టరీలో పనులు చేసుకుంటూ తల్లిని పోషిస్తున్నారు. వెంకటసుబ్బమ్మ ఐదేళ్లుగా బీపీతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆమె పక్షవాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడడంతో ఇంటి వద్ద తన పనులు తానే చేసుకుంటున్నారు. ఈ నెల 23న ఎప్పటిలాగే కామాక్షి పనులకెళ్లారు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో వెంకటసుబ్బమ్మ ఇంట్లోని బాత్‌రూమ్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన పక్కింటి తిరుపతమ్మ విషయాన్ని కామాక్షికి ఫోన్లో చెప్పారు. కామాక్షి హుటాహుటిన ఇంటి వద్దకు చేరుకొని తల్లిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటసుబ్బమ్మ శనివారం వేకువన మృతి చెందారు. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతరం ప్రజల మధ్యే..



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిత్యం ప్రజల మధ్యే తిరుగుతూ.. సమస్యలను పరిష్కరిస్తున్నానని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని పదో డివిజన్లో గల సరస్వతీనగర్, బాబూగిరిజన కాలనీ, తదితర ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 79 సచివాలయాల పరిధిలో రూ.32 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. ఓ ప్రాంతానికి తాను వెళ్లానని, నాలుగున్నరేళ్లుగా అనిల్‌కుమార్ కనిపించడం లేదంటూ ముగ్గురు మహిళలతో టీడీపీ నేతలు మాట్లాడించారని చెప్పారు. నియోజకవర్గంలో తాను కనిపించని వీధి ఏదో చెప్పాలని ప్రశ్నించారు. తాను రాజకీయాలు చేస్తే ఈ నాలుగున్నరేళ్ల కనిపించని వ్యక్తి వీధుల్లో తిరగలేని పరిస్థితి వస్తుందని చెప్పారు. ఇలాంటి చిల్లర రాజకీయాలను మానాలని హితవు పలికారు. నారాయణ స్కూల్లో పనిచేసే ఓ టీచర్ ఇటీవల చనిపోతే హాస్పిటల్లో బిల్లు చెల్లించలేని వ్యక్తులా తనపై మాట్లాడేదని ధ్వజమెత్తారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కిన్నెర ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు యువకులకు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని చెప్పారు. కార్పొరేటర్లు దేవరకొండ సుజాత, సఫియాబేగం, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్

నేత్రపర్వంగా పెనుశిల లక్ష్మీనృసింహుడి కల్యాణం



కల్యాణ మహోత్సవం



హాజరైన భక్తులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయిలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా శనివారం నిర్వహించారు. ద్వారకామాయి ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. భక్తులకు ముత్యాల తలంబ్రాలు, తీర్థ, అన్నప్రసాదాలను అందజేశారు. ఉభయకర్తలుగా నున్నా కిరణ్‌కుమార్, సుధ, సన్రాజు మురళీధర్‌రావు, అన్నపూర్ణ దంపతులు, వేముల వెంకటాద్రి, పద్మజ, పొట్లూరి షణ్ముఖాచారి, సాయికీర్తి, తదితరులు వ్యవహరించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవాధ్యక్షుడు పాబోలు రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాదిగల సంక్షేమమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాదిగల సంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లాల శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వర్గీకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం మాదిగల పది ప్రత్యేక డిమాండ్లతో కూడిన మనం ఎమ్మార్పీఎస్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నేతలు సునీత, శ్రీనివాసులు, కుమార్‌మాదిగ, శీనయ్య మాదిగ, పెంచలనరసయ్య, రమేష్, శ్యామల, తిరుపతమ్మ, శివ, వెంకటేశ్వర్లు, తులసి, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

మదర్‌థెరీసాకు ఘన నివాళి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మదర్ థెరీసా 113వ జయంతి వేడుకలను మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు భారతి, వాకర్ బలరామయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యమిత్రలు క్రియాశీలకంగా వ్యవహరించాలి

నెల్లూరు(బారకాసు): ఆరోగ్యశ్రీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఈ తరుణంలో ఆరోగ్యమిత్రలు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీపై ఆరోగ్యమిత్రలు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులతో సమావేశాన్ని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స నిమిత్తం రోగులు ఆస్పత్రుల్లో చేరిన నాటి నుంచి డిశ్చార్జయ్యేంత వరకు వారికి అండగా నిలవాలని ఆరోగ్యమిత్రలకు సూచించారు. రోగిపై అదనపు భారాన్ని మోపకుండా పూర్తి ఉచిత వైద్యాన్ని అందించాలని పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడారు. నెట్‌వర్క్ హాస్పిటళ్ల ద్వారా ఆరోగ్యశ్రీ క్యాంపులను సెప్టెంబర్ నుంచి నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ క్యాంపుల ద్వారా కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి బాధితులకు మెరుగైన చికిత్సను అందించనున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న పెంచలయ్య

డిగ్రీ పరీక్షల్లో 'జెనెక్స్' ప్రతిభ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో జెనెక్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని కళాశాల డైరెక్టర్లు వెంగళ్‌రెడ్డి, కొండలరావు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారిని కళాశాలలో శనివారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. బీఎస్సీలో జ్యోతి 9.67, మంజుల 9.66, బీకాం విభాగంలో ప్రవీణ 9.5, ప్రసూనాంబ 9.32, నిఖిల్ 9.12, బీబీఏలో మానస 9.35, లిఖిత్ 9.32 జీపీఏను సాధించారని వివరించారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభినందన

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం యథావిధిగా పనిచేయనున్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకొని బిల్లులను చెల్లించాలని కోరారు.

రంగడికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా పవిత్ర ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో శనివారం చేపట్టారు. దేవస్థాన ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలను విశేషంగా జరిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, సభ్యుడు నరసింహాచార్యులు పర్యవేక్షించారు.

కనులపండువగా మూలస్థానేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివార్ల కల్యాణోత్సవాన్ని కనులపండువగా శనివారం నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో పది రోజులుగా నిర్వహిస్తున్న రుద్రజప పారాయణ ముగింపు సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టారు.

ముస్లిం స్వర్ణకారుల సంక్షేమానికి కృషి



నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలోని ముస్లిం స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ముస్లిం స్వర్ణకార సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్మాయిల్ ఖాదరి పేర్కొన్నారు. ఈ నెల 20న నిర్వహించిన సంఘ ఎన్నికల్లో పట్టకార గుర్తుపై గెలుపొందిన ప్యానల్ అభ్యర్థులకు నియామక పత్రాలను కర్నూలులో సంఘ గౌరవాధ్యక్షుడు అబ్దుల్ షుకూర్ శనివారం అందజేశారు. తమ కార్యవర్గం 2028 వరకు కొనసాగనుందని తెలిపారు.

వ్యాధిగ్రస్తుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 42వ డివిజన్ పరిధిలోని గంజిఖానా వీధికి చెందిన ఫైజుల్లాకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ శనివారం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించేలా చర్యలు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని కార్పొరేటర్ కరిముల్లా తెలిపారు.

బదిలీలకు 31న కౌన్సెలింగ్

నెల్లూరు రూరల్: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 46 మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, మండల స్థాయి అకౌంట్స్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేటర్ల బదిలీలకు కేటగిరీల వారీగా దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్‌ను నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఈ నెల 31న నిర్వహించనున్నామని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి తెలిపారు. అభ్యంతరాలను సోమవారం సాయంత్రంలోపు తెలియజేయాలని కోరారు.

29న క్రీడా ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో క్రీడా ప్రతిభ అవార్డులను ఈ నెల 29న ప్రదానం చేయనున్నామని డీఈఓ గంగాభవానీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి స్కూల్ గేమ్స్ గ్రిగ్స్ పోటీల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను అవార్డులకు ఎంపిక చేశామని వివరించారు. పొదలకూరు మండలంలోని మహ్మదాపురం జెడ్పీ హైస్కూల్, కోవూరు మండలంలోని పాటూరు జెడ్పీ హైస్కూల్, కేఎన్నార్ నగరపాలక సంస్థ హైస్కూల్, కోవూరులోని జెడ్పీ బాలికల హైస్కూల్, ఆత్మకూరు బాలికల ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 30వ డివిజన్లో గల చంద్రబాబునగర్‌కు చెందిన వెల్లిమలై (పెద్దోడు), 100 మందితో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. పార్టీ నేత పిండి సురేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న వీరికి కండువాలను కప్పి ఎంపీ సాదరంగా ఆహ్వానించారు. నగరంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి, నేతలు దాసరి రాజేష్, ఏసునాయుడు, నవీన్, ప్రసాద్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డిని కలిసిన రైతులు

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కొమ్మరపూడికి చెందిన పలువురు రైతులు శనివారం కలిశారు. భూసేకరణ పరిహార బకాయిలపై వినతిపత్రాన్ని సమర్పించారు. తమ భూములకు పరిహారాన్ని జమచేయలేదనే అంశాన్ని కొందరు రైతులు ఆయనకు తెలియజేశారు. ప్రభుత్వంతో మాట్లాడి తమకు పరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కాగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని వేమిరెడ్డి హామీ ఇచ్చారు.



పారిశుధ్య మెరుగునకు ప్రత్యేక దృష్టి

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నగరంలో పారిశుధ్య మెరుగునకు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్, కొత్తహాల్, కనకమహల్, నర్తకి, అర్చన సెంటర్లు, రంగనాయకులపేట, రైల్వేస్టేషన్, ఆర్డీఓ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. అనంతరం 34 / 3 జీవీఆర్ కాలనీలోని వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. వెంకటేశ్వరపురంలోని లేఅవుట్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించాలని ఆదేశించారు.



పేరుకుపోయిన మురుగును పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీ రెడ్డి సమాజ మందిరంలో కుట్టు శిక్షణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు, క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి మాట్లాడారు. టైలర్ పార్వతి, తాను కుట్టులో శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. దాతల సహకారంతో దివ్యాంగ, ఎస్టీ మహిళలకు కుట్టు మెషీన్లను అందజేసి వారి జీవనోపాధికి తోడ్పాటునందిస్తామని చెప్పారు.



కళా సంబరాలు నేడు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో కళా సంబరాలను ఆదివారం నిర్వహించనున్నామని శాంతి కల్చరల్స్ అధ్యక్షుడు అమానుల్లాఖాన్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిరంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాటలు, నృత్య పోటీలను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నామని వివరించారు. కేతా సుబ్బారావు, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని మైపాడు గేట్ సమీపంలోని కృష్ణవేణి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ అఖిలేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ అనంతకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఐటీఐలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన కాంక్రీట్ ఇన్ఫ్రా డెవలపర్స్ ఇండియా లిమిటెడ్ దాతృత్వంతో పది కంప్యూటర్లను ఐటీఐకు అందజేశారు. ఈ క్రమంలో ల్యాబ్‌ను ప్రారంభించారు. ఐటీఐ, ఐఎంసీ చైర్మన్ నిరంజన్, ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు, పాలిటెక్నిక్ కళాశాల హెడ్ శివకుమార్, ఐటీఐ ట్రెయినింగ్ ఆఫీసర్ చెంగ్రాయన్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీటీ కాలనీలో కమిషనర్ పర్యటన

నెల్లూరు రూరల్: కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని ఆర్డీటీ కాలనీలో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపడతామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, స్థానికులు ఇటీవల తెలియజేశారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి నిధులను కేటాయిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ తరుణంలో కమిషనర్ పర్యటించారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు. పార్టీ ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాల కీర్తి రవి, నేతలు అరవ కామాక్షి, శంకర్‌రెడ్డి, కిశోర్ పాల్గొన్నారు.

